TELANGANA
RESOURCE CENTRE

"CHANDRAM" 490, St.No.11, Himayatnagar, Hyderabad-29 Mobile: 9030626288
E-mail: trchyd@gmail.com Website: www.trchyd.org

హైదరాబాద్, 27.09.2014:

**తెలంగాణ రిసోర్స్ సెంటర్** ఆధ్వర్యంలో శనివారం 'చంద్రం' భవన్‌లో **"తెలంగాణలో కొత్త విహార స్థలాలు" అనే అంశంపై** 141 వ చర్చ కార్యక్రమం మరియు **తెలంగాణ రిసోర్స్ సెంటర్ ప్రచురించిన "తెలంగాణలో కొత్త విహార స్థలాలు"** రచయిత శ్రీ ద్యావనపల్లి సత్యనారాయణ గారి పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా ... మన తెలంగాణలో కొత్త విహార స్థలాల గురించి, పుస్తకం గురించి .....పోరాటాల గడ్డగా పేరొందిన తెలంగాణ, చారిత్రక, వారసత్వ, పర్యాటక ప్రాధాన్య కట్టడాలకు, ప్రాంతాలకు వాటికి తోడు ప్రకృతి అందాలతో పర్యాటక, విహార స్థలాలుగా తెలంగాణలో అడుగడుగునా ఉన్నాయి. ఎన్నో వెలుగులోకి రాకుండా, ప్రాచుర్యం లేకుండా పోయాయి. ప్రతి కట్టడం, ప్రాంతం...ప్రతిదానికీ ఒక కథ ఉంటుంది. కొందరికే తెలిసిన గాథలు ఉంటాయి. వీటన్నింటి గురించి ఎక్కడ ఏ ప్రదేశాలు ఉన్నాయో, ఎలా చేరుకోవాలో తెలియజెప్పే టూరిస్ట్ గైడ్‌లా అచ్చమైన తెలంగాణవాదాన్ని అక్షరాల్లో ప్రతిబింబించేలా ఈ పుస్తకం రూపుదిద్దుకుందని తెలిపారు.

లక్షలాది ఏళ్ళ క్రితమే దక్కన్‌లో శిలలు జీవం పోసుకున్నాయి. ఆ కారణంగానే అత్యంత ప్రాచీన శిలా సంపద ఉన్న ప్రాంతంగా దక్కన్ పేరొందింది. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్ ప్రాంతాలు అటవీ అందాలకు పేరొందాయి. శాతవాహనులు, కాకతీయులు, కుతుబ్‌షాహీల రాజరికాలు అలనాటి చరిత్రకు శిథిల దాఖలాలు. ఈ కట్టడాలు కేంద్ర ప్రభుత్వం, అవిభక్త రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యానికి గురై గుర్తింపు లేకుండాపోయాయి. ప్రజల్లో వాటికి ప్రాచుర్యం రాకుండా పోయింది. సమైఖ్య రాష్ట్రంలో 138 ప్రదేశాలు 'ఏఎస్ఐ' గుర్తిస్తే అందులో కేవలం 8 ప్రదేశాలు మాత్రమే తెలంగాణ ప్రాంతానికి చెందినవి. మిగతా 130 సీమాంధ్ర ప్రాంతానికి చెందినవి. ఇటువంటి పరిస్థితులలో తెలంగాణలో చారిత్రకకారులు అనేక పరిశోధనలు చేసి తెలంగాణలోని చారిత్రక ప్రదేశాలను గుర్తించడం, వ్యాసాల ద్వారా, పుస్తకాల ద్వారా సమాజానికి ఎన్నో గుట్టలు, జలపాతాలు, లోయలు, మరెన్నో సజీవ సంస్కృతులు.....అన్నీ కలగలసి తెలియజేసేదే తెలంగాణ పర్యాటకం.

ఈ పుస్తక రచయిత డా॥ ద్యావనపల్లి సత్యనారాయణగారు తెలంగాణ మొత్తం తిరిగి, విషయ సేకరణ చేసి విశిష్టమైన పర్యావరణ, చారిత్రక పర్యాటక స్థలాలను కొన్నింటిని ఈ పుస్తకంలో అందిస్తున్నారు. వేసవి సెలవుల్లో చల్లగా ఉండే సుమారు ఎనభై ప్రదేశాలను ఎనిమిది మార్గాల ద్వారా ఎలా చూడవచ్చో, అడవుల్లో ఉండే జలపాతాలు, గుహలు, వ్యూ పాయింట్స్ గురించి ఎంతో వివరించారు. తెలంగాణలో వెనుకంజలో ఉన్న పర్యాటక రంగానికి ఈ అమూల్య రచన ఇతోధికంగా దోహదం చేయాలనే సత్సంకల్పంతో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటకం అంశంలో ప్రజలకు మార్గదర్శనం చేసేలా తెలంగాణ రిసోర్స్ సెంటర్ (టిఆర్‌సి) ఈ పుస్తకాన్ని ప్రచురించింది.

తెలంగాణలో పర్యాటకం ఊపందుకోవాలంటే పాఠశాల విద్య స్థాయి నుంచి ప్రాచుర్యం కల్పించడం ప్రారంభించాలి. ఆయా ప్రాంతాల సందర్శనకు ఇష్టపడే ప్రభుత్వ ఉద్యోగులను, సమాజంలోని ఇతర వర్గాలనూ ప్రోత్సహించాలి. ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలి. ఇవన్నీ కూడా పర్యావరణాన్ని ప్రజాప్రయోజనాలను పణంగా పెట్టకుండానే జరగాలి. దర్శనీయ పర్యాటక ప్రాంతాలపై శ్రద్ధపెట్టి మన ప్రాంతాన్ని, కట్టడాలని, పర్యాటక స్థలాలను కాపాడుకుంటూ , ప్రపంచానికి తెలియజెప్పే బాధ్యత మనందరిపైనా ఉన్నది.

పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడంవెనుక ముఖ్యమైన కారణంగా వాటి చరిత్రను వెలికితీయడం వాటిని

TELANGANA
RESOURCE CENTRE

"CHANDRAM" 490, St.No.11, Himayatnagar, Hyderabad-29 Mobile: 9030626288
E-mail: trchyd@gmail.com Website: www.trchyd.org

పరిరక్షించడం ప్రధాన ఉద్దేశంగా ఉండాలి. కానీ పర్యాటకం పేరుమీద వాటి వాతావరణాన్ని, చరిత్రను, వాటి నేచర్‌ను చెడగొట్టే విధంగా ఉండకుండా చూసుకోవడం ముఖ్యమని వక్తలు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ధనుంజయ్, శ్రీధర్ ధర్మాసనం, జక్కా గోపాల్, రఘుపతి, జగన్మోహన్‌రావు, చందా రాములు, డి.పి.రెడ్డి, ఆర్ వెంకట్‌రెడ్డి, పిట్టల శ్రీశైలం, కొమ్మిడి నర్సింహారెడ్డి, కస్తూరి ప్రభాకర్, భూపాల్ ...తదితరులు పాల్గొన్నారు.

నోట్: తెలంగాణ రిసోర్స్ సెంటర్ ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర పండుగైన 'బతుకమ్మ' సంబరాలు జరిగాయి. చర్చలో పాల్గొన్న మహిళలు బతుకమ్మ సంబురాలలో పాల్గొన్నారు.

–బోనకుర్తి సోమేశ్వర్
టిఆర్‌సి